ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
శనివారం 1 నవంబరు 2025





# ఎవరికి వెన్నెల..?

నవంబరు క్రాంతిపైనే చర్చలు
బిహార్ ఎన్నికల తర్వాతే అధిష్ఠానం నిర్ణయం..!
విస్తరణా.. నాయకత్వ మార్పా..?
సీఎంను కొనసాగించాలని రాహుల్, ఖర్గేకు 'అహింద' నాయకుల వినతి
రాసిపెట్టి ఉంటే మా అన్నే సీఎం అవుతారు : డీకే సురేశ్

బెంగళూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత్ వ్యాప్తంగా మొంథా తుఫాను మూడు నాలుగురోజుల్లోనే ముగిసింది. అయితే కర్ణాటక రాజకీయం రెండు వారాలుగా సంచలనాలు కొనసాగుతూనే ఉన్నాయి. 'నవంబరు క్రాంతి' అనే పదం నాలుగైదు నెలలుగా వినిపిస్తూనే ఉంది. ఎట్టకేలకు నవంబరు రానే వచ్చింది. ఇంతకీ ప్రస్తుత నవంబరులో ఏం జరుగుతుందనేది ఎవరికీ అంతుపట్టడం లేదు. కానీ కర్ణాటక ప్రభుత్వంలోని మంత్రులు, కాంగ్రెస్ కీలకనేతలంతా కేవలం క్రాంతి అంటూ... రోజుకో వ్యాఖ్య చేస్తున్నారు. ఇంతకూ ఈనెల మంత్రి వర్గ పునర్ వ్యవస్థీకరణ జరుగుతుందా... నాయకత్వ మార్పా అనేది ఎవరికీ స్పష్టత లేదు. కొన్ని నెలల కాలంగా నేనే సీఎం... మార్పులంటూ ఉండవు, పాలన పంచుకోవాలనే చర్చలు జరగలేదని ఇంతవరకు ఒకే పంథాలో కొనసాగిన సిద్దరామయ్య తాజాగా అధిష్ఠానం ఆదేశిస్తే ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉంటానన్నారు. దీన్నిబట్టి సిద్దరామయ్య కొనసాగాలన్నా అధిష్ఠానం స్పష్టత ఇవ్వాలనేది రుజువవుతోంది. ఇంతవరకు సిద్దరామయ్య సీఎంగా కొనసాగుతారని మార్పులు లేవని బహిరంగంగా మాట్లాడిన మంత్రులు జమీర్ అహ్మద్, మహదేవప్ప, సతీశ్ జార్కిహొళి వంటివారు ఏ నిర్ణయమైనా అధిష్ఠానందే అంతిమమంటున్నారు. దీన్నిబట్టి వారుసైతం అయోమయంలో పడినట్లు అయ్యింది. నెలక్రిందట అధిష్ఠానం ఆదేశించినంత మాత్రాన సాధ్యం కాదని, ఎమ్మెల్యేల మద్దతు ముఖ్యమన్న సిద్దరామయ్య ఎందుకు అధిష్ఠానం ప్రస్తావన తీసుకొచ్చారనేది సందిగ్ధానికి కారణమవుతోంది. రెండు వారాలుగా రాష్ట్రంలో కేవలం నవంబరు క్రాంతి విషయమై హల్‌చల్ చేస్తోంది. రాష్ట్రంలో తుఫాను అంశంగానీ, ఆర్ఎస్ఎస్ పథసంచలనంపై సాగుతున్న వాద వివాదాలకంటే క్రాంతిపైనే అందరి దృష్టి ఉంది. సిద్దరామయ్యకు ఎమ్మెల్యేల అండ ఉన్నా అధిష్ఠానం ఆదేశిస్తే నిర్ణయానికి అధిగమించి ఆయన వెంట ఎంతమంది ఉంటారనేది ఉత్కంఠగా మారింది. స్వయానా సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర మా నాన్న రాజకీయాల్లో చివరిదశల్లో ఉన్నారని, ఆయన ఆశయాలు మంత్రి సతీశ్‌జార్కిహొళి పాటిస్తారని ఉత్తరాధికారి అనేలా మాట్లాడారు. యతీంద్ర వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఇవ్వకపోయినా ఆయన మాటలనుబట్టి సిద్దరామయ్య సన్నిహితులు కానీ కుటుంబంలో చర్చకు గుసగుసలు లేవని చెప్పలేం. ప్రస్తుతం డీసీఎం డీకే శివకుమార్ సీఎం కావాలని వ్యాఖ్యానించేవారు కూడా లేకపోలేదు. అయితే ముందుగానే అడుగువేస్తే ఇబ్బంది ఉండవచ్చునని భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో ఎంతటి నేత అయినా అధిష్ఠానం ఆదేశాలను పాటించి తీరాల్సిందేనని అనేక సంఘటనలు రుజువు చేశాయి.





### అధిష్ఠానం మద్దతు సిద్దూకే..!

అధిష్ఠానంలో రాహుల్‌గాంధీ మద్దతు సంపూర్ణంగా సిద్దరామయ్యకే ఉంది. కానీ అగ్రనేత్రి సోనియా గాంధీ, ప్రియాంకగాంధీ డీకే శివకుమార్‌పై సానుకూలంగా ఉన్నారు. వీరి ముగ్గురి నిర్ణయమే అంతిమం. ఇక రాష్ట్రానికే చెందిన మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నా ఇక్కడి పరిస్థితులు సంపూర్ణంగా తెలిసి ఉన్నా నిర్ణయం తీసుకునేవారు కాదు. ఇక పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ కూడా అగ్రనేతల సైగలతోనే ముందుకు కదులుతారు. 2023 శాసనసభ ఎన్నికలు ముగిసి స్పష్టమైన మెజారిటీ ఉన్నా ముఖ్యమంత్రి అభ్యర్థిని ఖరారు చేసేందుకు ఢిల్లీలో వారం రోజులకుపైగా తర్జనభర్జనలు సాగాయి. అప్పుడు డీకే శివకుమార్‌కు స్పష్టత ఇవ్వకుంటే అన్నింటికీ అంగీకరించారని చెప్పలేం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వ్యవస్థీకృతంగా అభివృద్ధికి డీకే శివకుమార్ పాత్రను అధిష్ఠానం కూడా లేదని చెప్పలేదు. ఆయన కేపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన ప్రతి కార్యక్రమం రికార్డుస్థాయిలో విజయం సాధించింది. అందుకు సాధక బాధకాలు కూడా ఆయన ఒక్కరే భరించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రలో కూడా రాష్ట్రంలో జరిగినంతగా మరెక్కడా విజయవంతం కాలేదు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఏ రాష్ట్రంలో క్లిష్ట పరిస్థితిలో ఉన్నా కేవలం డీకే శివకుమార్‌ను మాత్రమే అధిష్ఠానం పంపుతోంది. అంతటి క్రియాశీలకమైన వ్యక్తికి సముచిత విషయంలో తగిన గుర్తింపు ఇవ్వరని చెప్పలేం.

### అహింద నేతల మద్దతు సీఎంకే..

సిద్దరామయ్యను ఐదేళ్లపాటు సీఎంగా కొనసాగించాలని రాహుల్‌గాంధీకి 'అహింద' నేతలు విన్నవించారు. ఇప్పటికే ఓ లేఖను రాహుల్‌గాంధీకి పంపినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పాలన సజావుగా సాగుతోందని, పార్టీలోనూ గందరగోళం లేదని మార్పువైపు వెళ్తే ఎక్కడికైనా దారితీయవచ్చునని ఓ సంకేతం కూడా ఇచ్చారు. అయితే అహింద నేతల ఆదేశాలను ఆ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలంతా పాటిస్తారని చెప్పలేం.

### దళిత సీఎంపైనా చర్చలు..

నాయకత్వమార్పు అంశం చర్చ జరుగుతున్న తరుణంలోనే మరోసారి దళిత సీఎం ప్రస్తావన తెరపైకి వచ్చింది. దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు సభ జరిపేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం సతీశ్‌జార్కిహొళి, పరమేశ్వర్ రహస్యంగా ఓసారి భేటీ అయ్యారు. ఈ ఏడాది జనవరి ప్రారంభంలో జరపతలపెట్టి అధిష్ఠానం హెచ్చరికలతో రద్దు చేసుకున్న దళిత నేతల సభ జరపాలని మరోసారి సిద్ధమయ్యారు. అయితే శుక్రవారం సభ విషయంలో మరోసారి వెనుకడుగు వేసినట్లుగా ఉంది. కాంగ్రెస్ కీలకనేత మల్లికార్జున ఖర్గే ముఖ్యమంత్రి అయినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని సొంతపార్టీకి చెందిన కొందరు అభిప్రాయపడుతున్నారు.



### మా అన్నకు అవకాశం రావచ్చు : డీకే సురేశ్

మరోవైపు మా అన్న డీకే శివకుమార్ తలరాతలో సీఎం కావాలని ఉంటే అవుతారని తమ్ముడు, మాజీ ఎంపీ డీకే సురేశ్ వ్యాఖ్యానించారు. డీకే సురేశ్ ఆలోచన ఏదైనా సిద్దరామయ్య నిరంతరంగా రాజకీయాల్లో ఉండాలని అభిప్రాయపడ్డారు. దీన్నిబట్టి యతీంద్రసిద్దరామయ్య తరహాలో నోటికొచ్చినట్టు మాట్లాడకుండా ఆచితూచి విమర్శలకు తావులేకుండా డీకే సురేశ్ మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ మార్పులు మరేదైనా బిహార్ ఎన్నికలు పార్టీకి సంపూర్ణ బలం వస్తే సంతోషంగా జరుగుతుంది. లేనిపక్షంలో అగ్రనేతల నిరాశ ఎటువంటి పరిణామాలకైనా దారితీయవచ్చు. ఏ మార్పులు లేకుండానే కొనసాగాలని హెచ్చరించి చేతులు దులుపుకొనే అవకాశం లేకపోలేదు.



వల్లభాయ్ పటేల్, ఇందిరా గాంధీకి నివాళి అర్పిస్తున్న సీఎం

## వల్లభాయ్ పటేల్ త్యాగాలను మరువలేం

● ఇందిరమ్మ ఆదర్శాలు పాటించడమే ఆమెకు గౌరవం
● సీఎం సిద్దరామయ్య ● మహనీయులకు నివాళి

బెంగళూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ త్యాగాలు మరువలేమని సీఎం సిద్దరామయ్య అన్నారు. విధానసౌధలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి, ఇందిరాగాంధీ వర్ధంతిని శుక్రవారం జరిపారు. ఈ సందర్భంగా చిత్రపటాలకు పూలు చల్లి సీఎం, తదితరులు నివాళి అర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో 562 సంస్థానాలు విలీనం చేసేందుకు పటేల్ ప్రయత్నమే కారణమన్నారు. బీజేపీ వారు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనలేదని ఎద్దేవా చేశారు. 1925లో ఆర్ఎస్ఎస్ ప్రారంభమైనా స్వాతంత్ర్య పోరాటంలో వారు పాల్గొనలేదన్నారు. ఇందిరాగాంధీ ధీమంత నాయకురాలని, దేశంలో పేదరిక నిర్మూలనకు ఆమె ఎంతో సేవలు చేశారన్నారు. 20 అంశాలతో దేశమంతటా మార్పుకు కారణమయ్యారన్నారు. కుల వ్యవస్థ కారణంగానే సమాజంలో భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయన్నారు. అనంతరం కేపీసీసీలో ఇందిరాగాంధీ వర్ధంతి సభలోనూ సీఎం తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచిస్తున్నారు..!

● నీటి విడుదలపై నిర్ణయం తీసుకోని టీబీ అధికారులు
● రబీకి నారుమళ్లపై రైతుల్లో సందిగ్ధత

కంప్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రబీ సాగుపై రైతులు అయోమయం చెందుతున్నారు. వరికి నారుమళ్లు వేసుకోవాలా లేదా అనే ఆలోచనలో పడ్డారు. తుంగభద్ర జలాశయంలో క్రస్ట్ గేట్ల ఏర్పాటుపై రబీ పంటకు నీరు విడుదల లేదని అధికారులు అంటున్నారు. కానీ జలాశయంలో 80 టీఎంసీలకు పైగా నీరు వుండటంతో ఏమి జరుగుతుందోనని చర్చించుకుంటున్నారు. ఇప్పటికే నది ఒడ్డున వుండే గ్రామాలు కోతలు పూర్తి చేసుకుని నారుమళ్లు వేసుకునేందుకు సిద్దంగా చేపట్టుకున్నారు. అధికారులు ఐసీసీ సమావేశం తీర్మానం అనంతరమే నీటి విడుదలపై ప్రకటిస్తామంటున్నారు.



సన్నాపురం వద్ద నారుమడికి సిద్ధం చేసి ఉంచిన రైతు

## 9 నెలల్లో 75వేల ఆపరేషన్లు

సర్జరీల్లో హుబ్బళ్లి మెడికల్ కళాశాల రికార్డు




కేఎంసీఆర్ఐ హాస్పిటల్

బెంగళూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక ప్రాంతంలో ప్రముఖ ఆసుపత్రుల్లో ఒకటిగా పేరొందిన హుబ్బళ్లిలోని కేఎంసీఆర్ఐ మెడికల్ కళాశాల ఆసుపత్రి ఆపరేషన్లలో సరికొత్త రికార్డును నెలకొల్పింది. కర్ణాటక మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (కేఎంసీఆర్ఐ) దశాబ్దకాలంగా పలు జిల్లాల పేదప్రజలకు సంజీవినిగా సాగుతోంది. ఇక్కడ పనిచేసే సీనియర్ ప్రొఫెసర్‌లు, వైద్యులు సమన్వయంగా వ్యవహరిస్తున్నారు. ఏటా సర్జరీలో ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా కొనసాగిస్తున్నారు. 2022లో 64,062 ఆపరేషన్లు చేశారు. 2023లో 75,013 శస్త్రచికిత్సలు చేశారు. 2024లో 1,00,912 ఆపరేషన్లు చేశారు. ప్రస్తుతం జనవరి నుంచి సెప్టెంబరు దాకా 75,227 ఆపరేషన్లు నిర్వహించారు. మేజర్ ఆపరేషన్లు 15,382 పూర్తి చేయగా సాధారణ శస్త్ర చికిత్సలు 59,845 నిర్వహించారు. ప్రతిరోజూ సగటున 250కు పైగానే సర్జరీలు సాధ్యం చేస్తున్నారు. ఆర్థో, ఈఎన్‌టీ, న్యూరో సర్జరీ, ఓబీజీ, ఆప్తమాలజీ, యూరాలజీ, పీడ్ సర్జరీ తదితర ఆపరేషన్లు చేస్తున్నారు. గుండె, కిడ్నీల వంటి అవయవమార్పిడి కూడా ఇక్కడ సాధ్యం చేస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర్ హొసమనె తెలిపారు. సీనియర్ డాక్టర్లు నిరంతరం సర్జరీలు చేయడంలో సహకరిస్తున్నట్టు తెలిపారు. అన్ని విభాగాల ఆపరేషన్లు చేశామన్నారు.

### వలసలతోనే సమస్యలు: మాజీ మంత్రి

మహదేవపుర, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అక్రమంగా నివాసం ఉంటున్న బంగ్లాదేశీయులతో సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రభుత్వ దృష్టికి పలుమార్లు తెచ్చినా ఎటువంటి చర్యలు లేవని మాజీ మంత్రి, మహదేవపుర టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు అరవింద లింబావళి విచారం వ్యక్తం చేశారు. దేవర బీసనహళ్ళిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఇటీవల బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తి చొరబడి అనుచితంగా వ్యవహరించిన విధానంపై శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలయంలో జయ, విజయ ద్వారపాలకు విగ్రహాలను నాశనం చేశాడన్నారు. స్థానికులు అతడిని బంధించి పోలీసులు అప్పగించారన్నారు. దర్యాప్తులో అతను అక్రమంగా చొరబడినట్టు తేలిందన్నారు. నియోజకవర్గంలో సుమారు 18కుపైగా స్థలాల్లో బంగ్లాదేశీయులు ఉన్నట్టు గుర్తించి వారి వివరాలను అధికారులు ఇచ్చామన్నారు. ఇటువంటివారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ హోబళి అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, ప్రధాన కార్యదర్శి నాగేశ్‌రెడ్డి, లోకేశ్, రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియాతో మాజీ మంత్రి అరవింద లింబావళి

## మహిళలకు భద్రత కరువు

● రెండేళ్లలో రాష్ట్రంలో 1800 మందిపై అత్యాచారాలు: కేంద్రమంత్రి శోభాకరంద్లాజె
● పదవుల కోసమే కాంగ్రెస్ నేతల పాకులాడుతున్నారన్న మంత్రి ● 'కిల్లర్ కాంగ్రెస్' పోస్టర్ల విడుదల



బీజేపీ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేస్తున్న కేంద్రమంత్రి శోభాకరంద్లాజె

బెంగళూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మహిళల ప్రాణాలకు గ్యారెంటీ లేదని, వెంటనే ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని మహిళల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రమంత్రి శోభాకరంద్లాజె డిమాండ్ చేశారు. బీజేపీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోతున్నా హోం మంత్రి ఏం చేస్తున్నారో తెలియదన్నారు. జిల్లా మంత్రులు సభలు జరుపుతున్నారా... లేదా అనేది వారికే తెలియదన్నారు. శాంతిభద్రతల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి అన్ని కార్యక్రమాలకు విమానం, హెలికాప్టర్లలో వెళ్తున్నారని, భూమిపై ఏం జరుగుతోందో ఆయనకు తెలియడం లేదన్నారు. కిల్లర్ కాంగ్రెస్ పాలనగా మారిందని మండిపడ్డారు. ఎవరు ముఖ్యమంత్రి కావాలి... ఎవరిని ఆశ్రయిస్తే మంత్రి పదవి దక్కుతుందనే బిజీగా ఉన్నారన్నారు.. బెంగళూరు ఉత్తరలో పోలీసు అధికారుల మార్పు కొనసాగుతోందన్నారు. ప్రతి పది నెలలకోసారి అధికారులను మార్చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రెండేళ్లలో 1800 మంది మహిళలపై లైంగికదాడి, అత్యాచారం, సామూహిక అత్యాచారాలు జరిగాయన్నారు. సీఎం సొంత జిల్లా మైసూరులో బెలూన్లు అమ్మేందుకు వచ్చిన ఓ చిన్నారిపై హత్యాచారానికి పాల్పడ్డారన్నారు. హుబ్బళ్ళిలో నేహా హత్య జరిగినప్పుడు స్వయాన తండ్రి కాంగ్రెస్ కార్పొరేటర్ ఎలా మాట్లాడారో అందరికీ స్వయంగా తెలుసునన్నారు. మహిళల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కిల్లర్ కాంగ్రెస్ పేరుతో పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్సీ భారతిశెట్టి, హేమలతానాయక్ పాల్గొన్నారు.




మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ శోభారాణి

## ఉక్కు సంకల్పంతోనే ఏకీకరణ

● 565 సంస్థానాలను ఏకం చేసిన ఘనత వల్లభాయ్ పటేల్‌దే
● ఉక్కుమనిషి 150వ జయంత్యుత్సవాల్లో బళ్లారి ఎస్పీ శోభారాణి

9

### తహసీల్దార్ కార్యాలయంలో లోకాయుక్త తనిఖీలు

సిరుగుప్ప, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త డీఎస్పీ ఎస్ఎస్ బేళగి శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో భారీగా అవినీతి, మౌలిక సదుపాయాలు లేకపోవడంపై ఇటీవల వెల్లువెత్తిన ఫిర్యాదుల మేరకు ఆయన తనిఖీలు చేపట్టారు. మరుగుదొడ్లు లేకపోవడంపై అధికారులపై మండిపడ్డారు. మీసేవ కేంద్రం వద్ద సార్వజనికులకు కూర్చునేందుకు ఆసనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడడంపై మండలించారు. సర్వే, జనన, మరణాల ఫైళ్లను సంక్షిప్తంగా పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టరాదాని, త్వరగా పనులు పూర్తి చేసి సహకరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ లోకాయుక్త సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న లోకాయుక్త డీఎస్పీ ఎస్ఎస్ బేళగి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రీన్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు బీవీ గౌడ

## నీరున్నా నిర్లక్ష్యమెందుకు..?

● నీటి విడుదలపై టీబీ బోర్డు ప్రకటన చేయాలి : రైతు సంఘం

9

## సమైక్య భారత నిర్మాణానికి బీజేపీ కృషి

● జాతీయ ఐక్యతా ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సమైక్య భారత నిర్మాణానికి బీజేపీ కృషిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు శుక్రవారం ధర్మవరంలో జాతీయ ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. గాంధీ నగర్ మారుతీ రాఘవేంద్రస్వామి కల్యాణ మండపం నుంచి కాలేజ్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. కళాశాల, పాఠశాలల విద్యార్థులు, వ్యాపార వేత్తలు, పురప్రముఖులు, సామాజిక సేవకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందిరెడ్డి మాట్లాడుతూ... వల్లభాయ్ పటేల్ దేశసమైక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. అనంతరం పోతుకుంటలో ఉన్న పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ అమర దేవేంద్ర, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు, పట్టణ, రూరల్ అధ్యక్షులు జింకా చంద్ర, గొట్లూరు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108



ట్రాఫిక్‌లో ఇరుక్కుయిన 108 అంబులెన్స్

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం 108 అంబులెన్స్ ట్రాఫిక్ మధ్యలో అరగంటకుపైగా ఇరుక్కుపోయింది. సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు కాలేజ్ సర్కిల్‌లో సమావేశం నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ ట్రాఫిక్‌లో 108 అంబులెన్స్ ఇరుక్కుపోయింది. ఎంత సేపు సైరన్ కొట్టినా ఎవరూ దారివ్వలేదు. ఇది చూసిన ప్రజలు కనీసం అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా రోడ్డుపై కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఏమిటని చర్చించుకున్నారు. సమావేశమయ్యాక అంబులెన్స్‌కు దారి వదిలారు.

## ఉద్యాన పథకాల ప్రయోజనం పొందండి

● మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన శాఖ పథకాల నుంచి నియోజకవర్గ రైతులు పూర్తి స్థాయిలో ప్రయోజనం పొందాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చి, రైతుల ఆదాయం పెంచడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందు కోసం ఫాం పాండ్లు, ప్యాక్ హౌస్ పథకాలకు నవంబరు 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి రైతు స్థానిక రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫాం పాండ్ల పథకం కింద ప్రభుత్వం రైతులకు 50 నుంచి 75 శాతం వరకు సబ్సిడీ అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ప్రకటనలో కోరారు.

## రైల్వే ట్రాక్‌మన్ బలవన్మరణం



అనిల్‌కుమార్ నాయక్(ఫైల్)

కొత్తచెరువు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రశాంతి రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న అనిల్‌కుమార్‌నాయక్(38) అనే రైల్వే ట్రాక్‌మన్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి తండాకు చెందిన అనిల్‌కుమార్ నాయక్ స్థానికంగా రైల్వే ట్రాక్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు గురువారం భార్య అనితాబాయితో కలిసి స్వగ్రామానికి వెళ్లాడు. అయితే విధి నిర్వహణలో భాగంగా గురువారం రాత్రి రైల్వే క్వార్టర్స్‌లోని ఇంటికి వచ్చాడు. తోటి ఉద్యోగి శుక్రవారం ఉదయం అనిల్‌కుమార్‌నాయక్ ఇంటి వద్దకు వెళ్లి పిలిచినా ఎంత సేపటికి పలుక లేదు. దీంతో కిటికీలో నుంచి చూడగా ఉరికివేలాడుతూ కనిపించాడు. దీంతో కొత్తచెరువు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనికుమార్ నాయక్ గతంలో ప్రమాదానికి గురికా వడంతో కాలికి రాడ్లు వేశారు. అవి నొప్పిగా ఉండటంతో తరచూ బాధపడుతుండేవాడు. కాలి నొప్పి భరించలేక శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య అనితా బాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు సాత్విక్ అనే కుమారుడు ఉన్నాడు.

## రేషన్ కార్డు ఉంటే ఉచిత వైద్యం

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి అసోసియేట్ డైరెక్టర్ రాజశేఖర్



మాట్లాడుతున్న రాజశేఖర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు ఉన్న పేదలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహిస్తామని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి అసోసియేట్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో దివంగత శ్రీరామరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని శుక్రవారం ఆయన మాజీమంత్రి రఘువీరారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.ఆరు కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆసుపత్రిని మూడో తేదీ ప్రారంభిస్తామన్నారు. ఆంధ్ర, తెలంగాణ, ఒడిసా 24 ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. నీలకంఠాపుం గ్రామంలో 25 వది ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అన్నీ రకాల కంటి పరీక్షలు, ఆపరేషన్లు నీలకంఠాపురంలోనే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కేటీ శ్రీధర్ స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా చెస్ క్రీడాకారుడికి అంతర్జాతీయ పతకం



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో జిల్లా చెస్ క్రీడాకారుడికి రజత పతకం దక్కింది. మంగోలియా దేశంలో నిర్వహించిన 19వ ఏషియన్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో భారత్ తరపున జిల్లా క్రీడాకారుడు శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ పాల్గొన్నాడు. ఈ పోటీల్ల అత్యంత ప్రతిభ కనబరిచిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్‌కు ద్వితీయ స్థానం దక్కింది. రజత పతకం సాధించిన క్రీడాకారుడిని పలువురు అభినందించారు.

# ఊసులాడి.. ఊడ్చేస్తారు..!

సోషల్ మీడియాలో కిలేడీ వెబ్‌సైట్ లింకులు

ఓపెన్ చేస్తే అమ్మాయిల గొంతుకతో కాల్స్

స్నేహం.. ప్రేమ.. పెళ్లి.. పేరిట బురిడీ

ఏకాంతంగా కలుసుకుందామని మోసాలు

హిందూపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికపై వలపు వలలో పడి యువకులు, పెళ్లైనవారు విలవిలలాడుతున్నారు. స్నేహం, జోడీ పేరిట కనిపించే వెబ్‌సైట్ లింకులను క్లిక్ చేసి.. బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసుకుంటున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్.. ఇలా ఏదో ఒక మార్గంలో అమ్మాయిల గొంతుతో కేటుగాళ్లు వాయిస్ కాల్స్ చేసి బురిడీ కొట్టిస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో అమ్మాయిలే ఇలా మోసగిస్తున్నారు. 'కలుసుకుందాం.. పెళ్లి చేసుకుందాం.. మాట్లాడుకుందాం..' అని లైన్‌లో పెట్టి, మాయ చేసి డబ్బులు కాజేస్తున్నారు. అటువైపు నుంచి వినిపించేది అమ్మాయిల గొంతే అయినా, మాట్లాడుతోందని అమ్మాయే అన్న గ్యారెంటీ లేదు. అయినా పెళ్లికాని యువకులు, పెళ్లి అయిన పురుషులు కూడా ఉచ్చులో పడిపోతున్నారు. సరదాగా వెబ్‌సైట్‌లు తెరిచి.. బుట్టలో పడిపోతున్నారు. గుట్టుగా మాట్లాడుకుంటున్నారు. అటువైపు ఉన్నది అపరిచితులే అయినా.. అడిగిన వెంటనే వేలు.. లక్షలు ఇచ్చేస్తున్నారు. మోసపోయామని తెలుసుకున్నా.. పోలీసులను ఆశ్రయించడం లేదు. అవమానంగా భావించి, స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పుకోవడం లేదు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. నిత్యం వందలాది మందిచిన దోచుకుంటున్నారు. అతి చనువు వెనుక దాగిన అపాయాన్ని పసిగట్టుకుంటే ప్రమాదం తప్పదని పోలీసులు తరచూ హెచ్చరిస్తున్నా చైతన్యం రావడం లేదు.

### ఊసులు ఆగిపోయి..

ప్రేమ, పెళ్లి, సహజీవనం పేరుతో విసిరే వలపు వలల వెనుక అమ్మాయిలే ఉన్నారో, కేటుగాళ్లు ఉన్నారో తెలియదు. మాట్లాడుతోంది మనిషో, ఏఐ బొమ్మనో తెలియదు. మంత్రాల్లాంటి మాటలవినిపించగానే ఇక అమ్మాయి దొరికేసింది అన్నట్లు బుట్టలో పడిపోతున్నారు. డబ్బులు కాజేసిన తరువాత అక్కడి నుంచి ఊసులు ఆగిపోగానే అవమాన భారంతో కుమిలిపోతున్నారు. స్నేహం పేరిట మొదలు పెట్టి మాటల్లో ఎక్కడెక్కడికో తీసుకుపోతున్నా అనుమానించడం లేదు. దీనికి కారణం.. సోషల్ మీడియాలో అందమైన యువతుల ఫొటోలతో కేటుగాళ్లు ఖాతాలను నిర్వహించడమే. హిందూపురం ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొన్నాళ్లపాటు ఇదే ప్రాంతానికి చెందిన కొందరికి ఫోన్ కాల్స్ చేసి.. ట్రాప్‌లో పెట్టి దోచేసింది. చివరకు కటకటాలపాలైంది.

### చుక్కలు చూపిస్తారు

ట్రాప్‌లో పడినవారికి సైబర్ నేరగాళ్లు చుక్కలు చూపుతున్నారు. ఏకాంతంగా కలుద్దామని పిలవడం, అక్కడికి వెళ్లగానే తమ కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగా లేదనో, ప్రమాదం జరిగిందనో మాయ మాటలు చెప్పడం పరిపాటిగా మారుతోంది. మాటలను నమ్మగానే వైద్యం పేరిట డబ్బులు గుంజుతున్నారు.


### కలుసుకుందాం రా..!

హిందూపురం పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగికి సోషల్ మీడియాలో ఓ వెబ్‌సైట్ లింక్ కనిపించింది. దాన్ని క్లిక్ చేసిన కాసేపటికి ఓ యువతి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఆమె సూచనతో రూ.1500 చెల్లించి ఆ వెబ్‌సైట్‌లో సభ్యుడిగా చేరాడు. అక్కడ సరైన జోడీ కోసం వెతుకుతుండగా మరో యువతి ఫోన్‌చేసి పలకరించింది. ఇద్దరి మధ్య కొన్నాళ్లు చాటింగ్, వాట్సప్, ఫోన్‌కాల్స్ కొనసాగాయి. అలా ఫోన్‌లో దగ్గరయ్యారు. 'మనం కలుసుకుందాం. ఎక్కడైనా రూమ్ బుక్ చెయ్' అని ఆమె ఊరించింది. ఆ యువకుడు మొహమాటానికి పోయాడు. 'వద్దులే.' అన్నాడు. దీంతో ఆమెనే చొరవ తీసుకుంది. 'బెంగళూరులో ఓ హోటల్ గది బుక్ చేస్తున్నా.. రూ.10 వేలు' అంది. మనోడు అలా వలలో పడిపోయాడు. ఆమె బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేశాడు. బెంగళూరుకు చేరుకుని, ఆమె బుక్ చేసినట్లు చెప్పిన హోటల్ వద్దకు వెళ్లాడు. అక్కడ ఆమె కనిపించలేదు. ఫోన్ చేస్తే.. 'అక్కడ వద్దు.. ఇంకో చోటకు రా..' అని పిలిచింది. అప్పటికే సమయం ముగియడంతో 'నాకు వేరే పని ఉంది. ఇంకోసారి కలుద్దాం..' అని చెప్పి తిరుగు ముఖం పట్టాడు. ఆ తరువాత కూడా ఫోన్ సంభాషణలు కొనసాగాయి. ఊరించి.. ఊరించి.. రూ.2 లక్షల దాకా కాజేసింది ఆమె. చివరకు మోసపోయానని అర్థమైంది. బయటకు చెబితే చులకన అవుతానని మౌనంగా ఉండిపోయాడు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది.

### పెళ్లి చేసుకుందాం..

సోమందేపల్లికి చెందిన ఓ చేనేత కార్మికుడు వారం క్రితం ఫేస్‌బుక్ చూస్తుండగా ఓ వెబ్‌సైట్ దర్శనమిచ్చింది. దాన్ని ఓపెన్ చేయగానే ఓ యువతి ఫోన్‌చేసి పలకరించింది. మాటలు కలిపింది. 'నాకు పెళ్లి కాలేదు. చేనేత కార్మికులు అంటే నాకు చాలా ఇష్టం. ఓ చేనేత కార్మికుడిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నా..' అంది. ఇదంతా నిజమేనని ఆ చేనేత కార్మికుడు అనుకున్నాడు. 'మీరూ చేనేత కార్మికుడే కదా..? ఓకే అంటే త్వరలోనే మనమిద్దరం పెళ్లి చేసుకుందాం..' అని నమ్మించింది. అలా లైన్‌లో పెట్టి.. ఖర్చుల పేరిట రూ.లక్ష దాకా లాగేసుకుంది. 'ఇంక పెళ్లి చేసుకుందాం రా..' అని కార్మికుడు ఆహ్వానించగానే.. 'వచ్చేస్తున్నా..' అని ఓ తేదీ చెప్పింది. ఆ రోజు నుంచి ఫోన్ కాల్స్ ఆగిపోయాయి. ఆ యువతి వాట్సప్ వాయిస్ కాల్స్ కాకుండా, ఇన్‌స్టా వాయిస్ కాల్స్ చేసి బురిడీ కొట్టించింది.

# ఇంటి వద్దకు ముఖ్యమంత్రి



కదిరి, పుట్టపర్తి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి శనివారం వస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ, ప్రజా దర్బార్, పార్టీ శ్రేణులతో జరిగే సమావేశాలలో ఆయన పాల్గొంటారు. గ్రామంలో 756 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయి. వీరిలో చింతలయ్య, రెడ్డెమ్మ, మేడా మల్లయ్య ఇళ్లకు వెళ్లి పింఛన్‌లను అందజేస్తారు. వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుంటారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ ఇళ్లకు వస్తున్నారని తెలుసుకుని వారు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఆ క్షణాల కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నామని అన్నారు. తమకు ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయని, పక్కా ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరుతామని చింతలయ్య, రెడ్డెమ్మ అన్నారు. హంద్రీనీవా నీటి రాకతో తమ ప్రాంత రైతులు సంతోషంగా ఉన్నారని మేడా పుల్లయ్య అన్నారు.

### నిరాడంబరం.. కట్టుదిట్టం

చంద్రబాబు పర్యటన నిరాడంబరంగా జరిగేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పరిశీలించారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, జేసీ మౌర్య భరద్వాజ్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రజా దర్బార్ వేదికను పరిశీలించారు. వీఐపీలు, గ్రామస్థులు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేయించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు.

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

- ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరుతారు.
- 11:30 గంటలకు పెద్దన్నవారిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11:40 గంటల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు స్వాగతం పలుకుతారు.
- 11:45 గంటలకు హెలిప్యాడ్ నుంచి గ్రామంలోకి చేరుకుంటారు.
- 12:15 గంటల వరకు గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తారు.
- 12:20 గంటలకి గ్రామ సమీపంలోని ప్రజావేదిక వద్దకు వెళతారు
- 01:50 గంటల వరకు ప్రజావేదికలో పాల్గొంటారు.
- ఆ తరువాత 2:30 గంటల వరకు విరామం
- 2:35 గంటలకు పెద్దన్నవారిపల్లికి సమీపంలో ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల సమావేశ వేదిక వద్దకు చేరుకుంటారు.
- సాయంత్రం 4 గంటల వరకు శ్రేణుల సమావేశంలో పాల్గొంటారు.
- ఆ తరువాత హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమౌతారు.

### నేడు పింఛన్ల పంపిణీ

జిల్లాలో శనివారం 2,64,802 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. వీరందరికీ రూ.115.92 కోట్లు పంపిణీ చేస్తారు. పింఛన్ సొమ్మును శనివారం తీసుకోని వారికి సోమవారం అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

## జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన చెస్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా చెస్ బాల, బాలికల క్రీడాకారులను ఎంపిక చేశారు. స్థానిక న్యూటౌన్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బాలుర విభాగంలో అచ్యుతరామరాజు, శర్వాన్‌తేజ్, ఎస్ కృష్ణసురేంద్ర, వినీత్, శ్రీధర్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో అనన్య, శ్రీహా, లాలిత్య, సుశాన్‌క్లారా, లక్ష్మీప్రణతి ఎంపికయ్యారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్, హుస్సేన్‌ఖాన్, మల్లికార్జున, పీడీలు రామకృష్ణ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

అనంతపురం విద్య, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పక్షంరోజులు పాటు జిల్లాలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈనెల15వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. జిల్లాకేంద్రంలోని నవోదయకాలనీలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ఈస్వాభిమాన ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు.

# ఓసీలను విస్మరిస్తే పన్నులు చెల్లించం

● ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఓసీలను విస్మరిస్తే ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా సహాయనిరాకరణ చేస్తామని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక లలితకళాపరిషత్‌లో జిల్లా విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓసీ విద్యార్థి యువ గర్జన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధిక శాతం పన్నులు రూపంలో చెల్లించేది ఓసీ వర్గాలకు చెందిన వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలేనన్నారు. అయినా నిరుపేద ఓసీల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. జాతీయ స్థాయిలో ఓసీ కార్పోరేషన్ ఏర్పాటు చేసి, రూ.లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణ పేదలకు మేజర్ జనరల్ సిన్హా నివేదిక మేరకు ఇతర వర్గాలతో సమానంగా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. ఓసీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ టెట్‌లో అర్హత మార్కులను ఓసీలకు 90 నుంచి 75కి తగ్గించాలన్నారు. పోటీ పరీక్షలకు వయోపరిమితిని సడలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథ్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు రాము, కార్యదర్శి మాధవరెడ్డి, రాయలసీమ బలిజ సంఘం సహాయ కార్యదర్శి సూరి, ఓసీ ఎలక్ట్రిసిటీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీధర్, ఆర్యవైశ్య ట్రస్టు అధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు సత్యనారాయణ శర్మ, రెడ్డి జేఏసీ నాయకులు శేషాద్రిరెడ్డి, సురేష్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

## రెవెన్యూ క్రీడలను విజయవంతం చేయండి

● కలెక్టర్ ఆనంద్



బెలూన్ ఎగురవేస్తున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. నగరంలోని కృష్ణ కళామందిర్‌లో శుక్రవారం నిర్వహించిన ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు-2025కు సంబంధించిన బెలూన్ ఎగురవేసే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగే రెవెన్యూ క్రీడలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్‌బాబు, సెక్రటరీ సోమశేఖర్, తహసీల్దార్ మోహన్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సంజీవరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రెవెన్యూ క్రెడిట్ సొసైటీ ట్రెజరర్ సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కలశ స్థాపన

● పులకించిన నెట్టికంటి అంజన్న భక్తులు ● హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు



అలంకారాలలో స్వామివారు.. తూర్పు గోపుర కలశ స్థాపనలో ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, కాలవ శ్రీనివాసులు



గుంతకల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కసాపురంలో నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ రాజగోపురాల కలశ స్థాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అన్ని గోపురాలపై శుక్రవారం ఉదయం 11 గంటలా 11 నిమిషాలకు ఏకకాలంలో వేద మంత్రోచ్చారణల మధ్య కలశాలను స్థాపించారు. ఈఓ విజయరాజు ఆధ్వర్యంలో వేద, రామాయణ పారాయణం, ఆరాధనలు, ద్వారతోరణ పూజ, ఉప కుంభారాధన, చతుస్థానార్చన, మూల మంత్ర హవనం, మన్యుసూక్త హవనం, పంచ సూక్త హవనం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తన కుటుంబ సభ్యులతో కలిసి క్రతువుల్లో పాల్గొన్నారు. తూర్పు గోపుర శిఖర కలశ స్థాపనలో ఎమ్మెల్యేలు కాలవ, గుమ్మనూరు పాల్గొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, గుంతకల్లు మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, మాజీ చైర్మన్ ఎన్ రామలింగప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు.





గోపురాలను సందర్శించి పూజ చేస్తున్న ఎంపీ అంబికా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్

## వర్షానికి కూలిన పూరిల్లు

● పరిహారం కోసం తహసీల్దార్‌కు వినతి




వర్షానికి కూలిన పూరిల్లు

తనకల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బంగారువాండ్లపల్లికి చెందిన రామప్ప పూరి గుడిసె ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి గురువారం రాత్రి కూలిపోయింది. అతడి కుటుంబ సభ్యులంతా బెంగళూరులో ఉండడం, అతడు రాత్రి బయట పడుకుని ఉండడంతో ఎవరికీ ఎటు వంటి హానీ జరుగలేదు. అయితే ఇంట్లో ఉన్న తిండి గింజలు, వంట సామగ్రి, బట్టలు, వ్యవసాయ పనిముట్లు ధ్వంసమయ్యాయి. దీంతో రూ. లక్ష ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు రామప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, పక్కాగృహం మంజూరు చేయాలని కోరాడు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతి పత్రం సమర్పించాడు. ప్రస్తుతం పడిపోయిన ఇంటికి పైన పట్టకట్టుకొని ఉంటున్నాడు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### దేవులపల్లి కృష్ణశాస్త్రి (జయంతి)



పద్మభూషణ్ గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం వద్ద 1897 నవంబరు 1న జన్మించారు. తెలుగు భావ కవితారంగంలో కృష్ణశాస్త్రి ఒక ముఖ్యఅధ్యాయం. ఆకాశవాణిలో లలితగీతాలు, నాటికలు, సినిమాలలో పాటలు రాయడం ద్వారా పేరొందారు. 1929లో రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కలసిన తర్వాత ఆయన కవిత్వంలో భావుకత వెల్లివిరిసింది. లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం కృష్ణశాస్త్రి పాటల్లో ప్రధాన లక్షణాలు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ గౌరవం, సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. 1980 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

### దీనానాథ్ భార్గవ (జయంతి)




అంతర్జాతీయ చిత్రకారుడిగా పేరొందిన దీనానాథ్ భార్గవ 1927 నవంబరు 1న మధ్యప్రదేశ్‌లో జన్మించారు. జాతీయచిహ్నం 'అశోకచక్రం, నాలుగుసింహాల' రూపకల్పన బృందంలో సహ చిత్రకారుడిగా ఉన్నారు. రాజ్యాంగ పేజీల చిత్రాల రూపకల్పనలోనూ ఉన్నారు. బట్టలపై మధుబని పెయింటింగ్స్ వేసి తనదైన గుర్తింపు పొందారు. ఆలిండియా హ్యాండ్‌లూమ్ బోర్డులో డైరెక్టర్‌గా కొనసాగి 1986లో రిటైరయ్యారు. 2016 డిసెంబరు 24న కన్నుమూశారు.

### వట్టికోట ఆళ్వారుస్వామి (జయంతి)




వట్టికోట ఆళ్వారుస్వామి 1915 నవంబరు 1న తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా చెరువు మాదారంలో జన్మించారు. తెలంగాణ ప్రజాసాహిత్యానికి పాదులు వేసి ప్రాణంపోసిన ఆయన రచయిత, సేవాశీలి, ఉద్యమకర్త, కమ్యూనిస్టునేతగా పేరొందారు. పాత్రికేయుడిగా, ప్రచారకుడిగా, భాషాసాహిత్యాల నుంచి పౌర హక్కులదాకా అన్ని ఉద్యమాలలో పాలుపంచుకున్నారు. తెలుగులో రాజకీయ నవలలకు ఆద్యుడు. గ్రంథాలయ ఉద్యమంతో మొదలైన ప్రేరణతో నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ పాల్గొని జైలుపాలయ్యారు. హోటల్ కార్మికుడిగా జీవితం ప్రారంభించిన ఆయన స్వయంగా చదువుకుని రచయిత, ప్రచురణకర్త అయ్యారు. 1961 ఫిబ్రవరి 5న కన్నుమూశారు.

### త్యాగరాజ భాగవతార్ (వర్ధంతి)



కర్ణాటక సంగీత గాయకులు మాయవరం కృష్ణస్వామి త్యాగరాజ భాగవతార్ 1910 మార్చి 1న తంజావూరు జిల్లా మాయవరంలో జన్మించారు. నటుడిగా, నిర్మాతగాను రాణించారు. తమిళ సినిమా రంగంలో తొలి సూపర్‌స్టార్ గా గుర్తింపు పొందారు. కాగా భక్తిగీతాలకు కంపోజర్ గాను వ్యవహరించారు. 1944లో 'హరిదాస సినిమా' బ్రాడ్‌వే థియేటర్‌లో వరుసగా మూడేళ్లపాటు ప్రదర్శించబడింది. 1959 నవంబరు 1న కన్నుమూశారు.

### హోమి కే బాబా (పుట్టినరోజు)



పద్మభూషణ్ గ్రహీత హోమి ఖార్‌షెడ్‌జీ బాబా 1949 నవంబరు 1న బాంబేలో జన్మించారు. ఇంగ్లిష్ స్కాలర్‌గా, క్రిటికల్ థియరిస్ట్‌గా రాణించారు. హ్యూమానిటీస్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఎడిటోరియల్ కాలమ్స్ రాశారు. ఆయన పలు రచనలు, పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. సాహితీసేవలకు 2012లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు.

### వీవీఎస్ లక్ష్మణ్ (పుట్టినరోజు)



వంగిపురు వెంకటసాయి (వీవీఎస్) లక్ష్మణ్ 1974 నవంబరు 1న జన్మించారు. భారత క్రికెట్‌జట్టు సభ్యుడిగా పలు విజయాలు అందించారు. ఇంతవరకు 127 టెస్ట్ మ్యాచ్‌లు, 86 వన్డేమ్యాచ్‌లకు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించారు. టెస్టులలో 16శతకాలు, వన్డేలలో 6 సెంచరీలు సాధించారు. టెస్టులలో ఆయన అత్యధిక వ్యక్తిగతస్కోరు 281 పరుగులు. 2008లో జరిగిన తొలి ఐపీఎల్‌లో దక్కన్‌చార్జర్స్ జట్టుకు నాయకత్వం వహించారు. 2011లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

### ఐశ్వర్యరాయ్ (పుట్టినరోజు)



మాజీ ప్రపంచసుందరి, నటి ఐశ్వర్యరాయ్ 1973 నవంబరు 1న జన్మించారు. 1994లో విశ్వసుందరిగా ఎంపికయ్యారు. పలు సినిమాలు, యాడ్స్‌లలోనూ నటించారు. ఫిలింఫేర్ పురస్కారాలు అందుకున్నారు. 2007లో హిందీ నటుడు అభిషేక్ బచ్చన్‌ను వివాహం చేసుకున్నారు. 2009లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. తెలుగులోనూ పలు సినిమాలలో నటించారు.

# బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

**యూనియన్ బ్యాంకు సర్కిల్ మేనేజర్ కల్యాణ్‌వర్మ**

బెంగళూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యూనియన్‌బ్యాంకు ఖాతా దారులకోసం ప్రత్యేకమైన పథకాలను అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని యూనియన్‌బ్యాంకు బెంగళూరు సర్కిల్ మేనేజర్ కల్యాణ్‌వర్మ అభిప్రాయపడ్డారు. బెంగళూరు ఉత్తర పరిధిలోని దేవనహళ్ళిలో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సమగ్ర అభియాన సమావేశం జరిగింది. రిజర్వుబ్యాంకు రీజనల్ డైరెక్టర్ కాయ త్రిపాఠి, జనరల్ మేనేజర్ మీనాక్షిగంజు, దేవనహళ్ళి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పీఎంజేడీవై ఖాతా లు తెరవాలని సూచించారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై వంటి సం క్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిజిటల్ మోసాలకు భయపడరాదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనియన్‌బ్యాంకు ఉత్తర విభాగం మేనేజర్ గాలి రాంప్రసాద్, హారోహళ్ళి గ్రామపంచాయతీ సర్పంచ్ ఉమాదేవి. ఆర్‌బీఐ డీజీఎం అరుణ్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులు

# ఒక్కసారి పరీక్షించుకోండి

**బ్రెస్ట్ క్యాన్సర్‌పై అపోలో కొత్త సందేశం**



చెక్ ఒలేట్ కార్యక్రమంలో వైద్యులు తదితరులు

బెంగళూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సమాజంలో క్యాన్సర్ బారినపడి సకాలంలో వైద్యులను సంప్రదించకుండా చివరిదశలో ఇబ్బంది పడుతున్నారని అపోలో క్యాన్సర్ సెంటర్ వినూత్నంగా ఒక్కసారి పరీక్షించుకుండి, చెక్ ఒలేట్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ప్రకటించారు. బెంగళూరులో శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో అంకాలజీ ఇంటర్నేషనల్ విభాగం చైర్మన్ దినేశ్ మాధవన్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే దేశం బలోపేతం అవుతుందని వారి ఆరోగ్యమే జాతికి శక్తి అని అభిప్రాయపడ్డారు. చెక్ ఒలేట్ అభియాన ద్వారా సమాజానికి ఓ సందేశం ఇవ్వదలిచామన్నారు. నటి పూజా గాంధీ మాట్లాడుతూ అందరికీ చాకొలేట్ ఇష్టమని, అది సంతోషం కలిగిస్తుందన్నారు. అందుకే చెక్ ఒలేట్ ద్వారా మహిళల్లో సొంతంగా తమ ఆరోగ్యం పట్ల అవగాహన పొందేలాంటి ప్రయోగానికి శ్రీకారం చుట్టారన్నారు. అపోలో క్యాన్సర్ సెంటర్ బ్రెస్ట్ అంకాలజీ జయంతి తుమ్సి మాట్లాడుతూ స్థన క్యాన్సర్‌ను త్వరితగతిన గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. కొన్ని నిమిషాల వ్యవధిలో పరీక్షించే విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. చెక్ ఒలేట్ అనేది ఓ చాకొలేట్ ఎలాంటి అనుభూతిని కలిగించనుందో అంత సులభంగా పరీక్షించుకునేందుకు వీలుందన్నారు. డార్క్ చాకొలేట్‌లోని యాంటి ఆక్సీడెంట్‌లు, హృదయ, చర్మ మనస్థితిని సుధారించేందుకు సహకరించనుం దన్నారు. చెక్ ఒలేట్ బార్‌లోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే స్వయంగా పరీక్షించుకునే విధానాన్ని అంచెలంచెలుగా చూపి యానిమేటెడ్ వీడియో వస్తుందన్నారు.

# దేశంలో భిన్నత్వంలో ఏకత్వం

**● రన్ ఫర్ యూనిటీలో సీఐ ప్రశాంత్‌వర్ణి**

బాగేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలోనూ ఏకత్వం సాధించిన ఘనత దేశానికి ఉందని, జాతీయ ఐక్యత ప్రపంచ ఖ్యాతి సాధించిందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌వర్ణి అన్నారు. ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్‌పేటల్ 150వ జయంతి సందర్భంగా పోలీసుశాఖ, ఇతర సంఘాలతో కలసి శుక్రవారం యూనిటీ ఫర్ రన్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది, వందలాదిమంది పాఠశాల కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్‌లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశం బలోపేతం కావడంలో సర్దార్‌వల్లభాయ్‌పటేల్ పాత్ర కీలకమన్నారు. స్వాతంత్ర్యానంతరం ఎన్నో సంస్థానాలు విలీనం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించి ప్రజాస్వామ్య ప్రభుత్వానికి బాటలు వేశారన్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి నేషనల్ కాలేజ్ వరకు పరుగు సాగింది.

**సంస్థానాల విలీనంలో పటేల్ పాత్ర కీలకం**

బంగారపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానంతరం దేశంలోని రాజసంస్థానాలను విలీనం చేయడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణం పోశారని ఇందుకు సర్దార్‌వల్లభాయ్‌పటేల్ పాత్ర కీలకమని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దయానంద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో పోలీసు, విద్యాశాఖ సంయుక్తంగా ఏక్తాదివస్‌లో భాగంగా మారథాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. జాతీయ ఏక్తాలో సార్వభౌమత్వాన్ని కాపాడిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పేటల్ ఆదర్శప్రాయులన్నారు. మైదానంలో ప్రారంభమైన మారథాన్ పురవీధులలో సాగింది. కార్యక్రమంలో ఎస్సై రాజణ్ణ, ఏఎస్సై రమేశ్, టీచర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



బాగేపల్లిలో రన్ ఫర్ యూనిటీలో సీఐ ప్రశాంత్‌వర్ణి తదితరులు



బంగారపేటలో జాతీయ ఏక్తా దివస్‌లో సీఐ దయానంద్ తదితరులు

# ఇందిరాగాంధీ సేవలు అపారం: డీకే



ప్రసంగిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బొమ్మనహళ్ళి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు అపారమని పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఇందిరాగాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 14ఏళ్లపాటు ప్రధానిగా అపారమైన సేవలందించారన్నారు. ముఖ్యంగా గరీబీ హటావో నినాదంతో పేదలకు అండగా నిలిచారన్నారు. దున్నేవాడిదే భూమి, పేదలకు ఇళ్లు కల్పించడంతోపాటు బ్యాంకు సేవలను సరళీకృతం చేశారన్నారు. కాగా సోనియాగాంధీ త్యాగం చేసి ప్రధానిగా మన్మోహన్‌సింగ్‌కు అవకాశం కల్పించిందన్నారు. కాంగ్రెస్ సామరస్యంతో కొనసాగుతుండగా బీజేపీ మతతత్వాలతో చిచ్చు పెడుతోందని ఆరోపించారు. ఇదే సందర్భంగా ఇందిరాగాంధీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు సౌమ్యరెడ్డి, ఆనేకల్ ఎమ్మెల్యే శివణ్ణ, యూబీ వెంకటేశ్ స్థానిక నాయకులు అరుణ్‌కుమార్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# 'బ్రెయిన్‌స్ట్రోక్‌పై అప్రమత్తం తప్పనిసరి'

బెంగళూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఏటా లక్షలాదిమంది అకస్మిక బ్రెయిన్ స్ట్రోక్‌లతో జీవితాన్ని కోల్పోతున్నారని ముందస్తు హెచ్చరికలను గుర్తించడంలో విఫలం కావడమే కారణమని మణిపాల్ ఆసుపత్రి వైద్యనిపుణుడు ఉల్లాస్ ఆచార్య అభి ప్రాయపడ్డారు. శుక్రవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైనవారికి ప్రతి నిమిషం అత్యంత కీలకమన్నారు. వారు ఎలా ప్రతిస్పందిస్తున్నారో గుర్తించి వైద్యుల సలహాలు పాటిస్తే ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. అందుకే స్ట్రోక్ పే రోక్ అనే నినాదంతో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్ట్రోక్ లక్షణాలను గుర్తించి ప్రాణాలు కాపాడేందుకు ఈ ప్రయోగాన్ని కేంద్రీకరిస్తున్నామన్నారు. ఫేస్ డ్రాపింగ్, ఆర్మ్ వీక్‌నెస్, స్పీచ్ డిఫికల్టీలో వస్తున్న మార్పులను గుర్తించి వెంటనే ఆసుపత్రులకు తీసుకెళ్లాలన్నారు. ప్రజలలో అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నామన్నారు.




మీడియాతో డాక్టర్ ఉల్లాస్ ఆచార్య తదితరులు

# సాహిత్యం ద్వారానే సమాజ ప్రగతి

**● పీఠాధిపతి శివరాత్రి దేశికేంద్రస్వామీజీ**

బెంగళూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సాహిత్యం ద్వారానే సమాజ ప్రగతి సాధ్యమైందని సుత్తూరు పీఠాధిపతి శివరాత్రి దేశికేంద్రస్వామిజీ అభిప్రాయపడ్డారు. సాహిత్యసేవా ప్రతిష్ఠాన ఆధ్వర్యంలో శుక్రవారం సంస్కృతి సంగమ 2025 సదస్సు జరిగింది. ముఖ్యులుగా మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తమ బిళిమలె పాల్గొన్నారు. సాహిత్యసేవా ప్రతిష్ఠాన అధ్యక్షుడు డాక్టర్ సీ సోమశేఖర్ ఫౌండేషన్ సాధనలను వివరించారు. ఈ సందర్భంగా 2025 ఏడాదికి సంబంధించి జానపద సాహిత్యంలో కర్ణాటక జానపద పరిషత్ సంస్థకు, వచన సాహిత్యంలో డాక్టర్ రంజాన్ దర్గాకు, దాస సాహిత్యంలో ఖాతా చిక్కణ్ణకు, సాంస్కృతిక సంస్థలో శ్రీనివాస్ జీ కప్పణ్ణకు, సంగీత విభాగంలో కస్తూరిశంకర్ పురస్కారాలు ప్రదానం చేశారు. 2015 నుంచి ఏటా భిన్నరంగాలలో సాధకులకు పురస్కారాలు అందిస్తున్న ప్రకటించారు.



వివిధ రంగాల సాధకులకు పురస్కారాలతో సన్మానం

బంగారం ధరలపై

# అసోసియేషన్‌ను సంప్రదించండి



మీడియా సమావేశంలో జేఏబీ అధ్యక్షుడు చేతన్‌కుమార్ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బంగారం ధరలు రోజువారీ కాకుండా గంటల వ్యవధిలోనే తేడాలు వస్తున్నాయని ఎటువంటి సందేహాలు ఉన్నా జ్యువెలర్స్ అసోసియేషన్ బెంగళూరు (జేఏబీ)ని సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు కోరారు. గురువారం నగరంలో జేఏబీ అధ్యక్షులు చేతన్‌కుమార్ మెహతా మీడియాతో మాట్లాడుతూ తమ సంస్థ 85ఏళ్లుగా సేవలంది స్తోందన్నారు. బంగారం ధరలు నగరాలవారీగా భిన్నంగా ఉంటాయన్నారు. ఇటీవల కొన్ని ఆభరణ మేళాలలో వాటి ధరలను ఎప్పటికప్పుడు ప్రకటిస్తున్నారన్నారు. అది గందరగోళానికి కారణమవుతోందన్నారు. అసోసియేషన్ ప్రతినిధులను సంప్రదించి నికరమైన ధరను తెలుసుకోవాలన్నారు. సంస్థకు బెంగళూరులో జ్యువెలరీ పార్క్ నిర్మించేందుకు ప్రభుత్వం స్థలం మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ శరవణతోపాటు ముఖ్యమంత్రిని త్వరలోనే కలుస్తామన్నారు. ఆభరణాల విన్యాసం, నైపుణ్యత ఉత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఏర్పాటు చేయదలిచామన్నారు. రానున్న బడ్జెట్‌లో నగర పరిధిలోనే స్థలం కేటా యించేలా హామీ ఇవ్వాలన్నారు. ఆభరణాల వ్యవహారంలో పారదర్శకత కల్పిం చాలన్నదే సంస్థ లక్ష్యమన్నారు. జేఏబీ సలహాదారుడు జీవీ శ్రీధర్, ఉపాధ్యక్షుడు అశోక్ రాథోడ్, గౌరవ కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవాన

# మొక్కలు నాటిన విద్యార్థులు



ఐక్యతా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు తదితరులు

బెంగళూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యలహంకలోని జ్ఞానభారతి పాఠశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీసులు విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి సిబ్బందితోపాటు పాల్గొన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవ ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి వివరించారు. కార్యదర్శి యశ్విత్‌రెడ్డితోపాటు పోలీసులు విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

# నేడు ఓరియన్‌లో వాటర్ ప్రొజెక్షన్

బెంగళూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవాన్ని పురస్కరించుకుని రాజాజినగర్ ఓరియన్‌మాల్‌లో వాటర్ ప్రొజెక్షన్ షో ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. లేక్‌సైడ్ శనివారం సాయంత్ర 6.30 నుంచి ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు. నమ్మ కర్ణాటక - నమ్మ వాటర్ ప్రొజెక్షన్ షో పేరిట ప్రదర్శనలు ఉంటాయన్నారు. స్వాతంత్ర్య సమరయోధురాలు కిత్తూరు రాణి చన్నమ్మ ప్రత్యేకచిత్రం ప్రదర్శన ఉందన్నారు. వినోద కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# రేషన్ షాపుల్లో బహిరంగ దోపిడీ

గుంతకల్లు టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా కొందరు డీల ర్లు బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారు. గుంతకల్లు పట్టణంలో 70, మం డలంలో 39 రేషన్ షాపులు ఉన్నాయి, దాదాపు 42 వేల కార్డులు ఉన్నాయి. పలు రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు సుమారు ఒక టిన్నర కిలోల బరువున్న డబ్బాను ఉంచి.. తూ కం వేసి లబ్దిదారులకు వేస్తున్నారు. 20 కేజీల బియ్యాన్ని ఒక సారి ఇలా తూకం వేసి ఇస్తారు. కార్డులకు 35 కేజీల బియ్యం ఇవ్వాల్సి వస్తే.. రెండు సార్లు తూకం వేసి ఇస్తారు. అంటే అప్పుడు మొత్తం మూడు కేజీల బియ్యాన్ని తక్కువగా ఇస్తారు. దీనిపై లబ్దిదారులు ప్రశ్ని స్తే.. స్టాక్ పాయింట్‌లో వంద కేజీల ప్యాకెట్‌కు తూకం తక్కువ వ స్తుందని, ప్రతి నెలా అధికారులకు మామూళ్లు ఇస్తున్నామని.. డీలర్లు దబాయిస్తున్నా రు. ఇలా డీలర్లు ప్రతి కార్డు మీద బియ్యాన్ని దోపిడీ చే స్తూ... ప్రతి నెలా రూ. లక్షలు దండుకుంటున్నారు. ఇలా వీరు బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నా.. రెవెన్యూ, తూనికల శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారే తప్పా.. ఏ మా త్రం చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ఫిర్యాదు చేస్తేనే తాము స్పందిస్తామని వారు తెగేసి చెబుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు వివరణ కోరేందుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.



తూకానికి బియ్యంతో పాటు ఉంచిన డబ్బా

# రైతు సమస్యలపై స్పందించపోతే తీవ్ర పోరాటం: మాజీ మంత్రి నాడగౌడ

రాయచూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి నాల్గు జిల్లాల రైతులకు రెండవ పంటకు నీరిచ్చే విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోతే ప్రత్యేక పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని మాజీ మంత్రి వెంకటరావ్ నాడగౌడ హెచ్చరించారు. రెండవ పంటకు సాగునీటి విడుదల విషయమై నవంబర్ 3న అఖిల పక్షం రైతు సంఘాల ప్రతినిధుల బృందం బెంగళూరుకు తరలి జలవనరుల శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అఖిల పక్షం సమావేశంలో నిర్ణయించామని మాజీ మంత్రి వివరించారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాజీ మంత్రి మాట్లాడారు. తుంగభద్ర జలాశయంలో 30 గేట్‌లను పునర్ నిర్మించేందుకు ప్రభుత్వం ఇప్పటికే తీర్మానించిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఆరు మాసాల గడువు కావాలని చెబుతుండడం సరికాదన్నారు. కాంట్రాక్టర్‌లు ఇంజనీయరింగ్ నిపుణులు, మూడు నెలల్లోగా వాటిని అమర్చవచ్చని చెబుతున్నా ప్రభుత్వం ఎందుకు రెండవ పంటకు నీరు ఇవ్వరాదని నిర్ణయించిందో అర్థం కావడం లేదన్నారు. సాగునీటి రంగ నిపుణుడు కన్నయ్య నాయుడును సంప్రదించగా రెండవ పంటకు నీరిచేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అనంతరమే గేట్‌ల మరమ్మత్తు చేపట్టవచ్చని వివరించారన్నారు. అక్టోబర్ 31వ నాటికి 15 గేట్‌ల పునరుద్ధరణ జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 8 గేట్‌లను మాత్రమే అమర్చారని ఈ విషయంలో కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి బిల్లులు అందక పోవడమే కారణమన్నారు. ప్రభుత్వం నీటిపారుదల నిపుణులు ఇంజనీయరింగ్ నిపుణులతో మరో సారి చర్చించి రెండవ పంటకు నీరిచ్చే అంశంపై అధికారికంగా ప్రకటన చేయాలేన్నారు. ఈ విషయంలో నిపుణులను కాదని మంత్రి శివరాజ్ తంగడగి నీటి విడుదలను నిలిపివేస్తున్నట్లు చెప్పడం హాస్యస్పదమన్నారు. ఈ విషయంలో ఇప్పటికే రైతులు ఆందోళనలో ఉన్న నేపథ్యంలో వారు ఆర్థికంగా మరింత నష్టపోయే ప్రమాదం జరగకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వెంకటరావ్ నాడగౌడ



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1626.06 | 1632.00 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 12,606 | 13,468 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 12,248 | 13,168 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 80.00 | 101.77 |

# ఉక్కు సంకల్పంతోనే ఏకీకరణ

- 565 సంస్థానాలను ఏకం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌దే: ఎస్పీ శోభారాణి
- ఉభయ జిల్లాలో ఘనంగా పటేల్ జయంతి


గురు కోటేశ్వర అకాడమీ విద్యార్థులతో ఎస్పీ శోభారాణి

బళ్లారి సిటీ,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం అని , ప్రపంచంలో జాతీయ ఐక్యతను ప్రకటించిన దేశం మనదేనని ఎస్పీ శోభారాణి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఏకీకరణ నిర్మాత సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవంలో భాగంగా పౌరుల భద్రత , బాధ్యతల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి జిల్లా పోలీస్ శాఖ శుక్రవారం నగరం లోని డీఏఆర్ పోలీస్ గ్రౌండులో నిర్వహించిన రన్-ఫర్ యూనిటీ మారథాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశం ఏకీకరణకు కారణమైన ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లబాయ్ పటేల్ అపారమైన కృషి చేశారని, భారతదేశం స్వాతంత్ర్య పొందిన తర్వాత, అన్ని రాష్ట్రాలను విలీనం చేసి, సమాఖ్య వ్యవస్థను ఏకీకృతం చేయడానికి ఆయన కృషి చేశారన్నారు. భారతదేశంలోని 565కి పైగా సంస్థానాలను ఏకం చేసి ఒకే సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత పటేల్‌దేనన్నారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ ఉక్కు లాంటి ధృఢ సంకల్పమే దేశ ఐక్యతకు కారణమని, రాజీ సైనిక శక్తి ద్వారా ఆయన ఐక్యతను సృష్టించారన్నారు. అందువల్ల స్వతంత్ర భారతదేశ తొలి ఉప ప్రధానిమంత్రి ,హోంమంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 31ని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఆన్‌లైన్ మోసాలకు ఎక్కువగా ప్రజలు మోసపోతున్నారని.ఎవరైన తెలియని వ్యక్తి ఫోన్‌చేసి వ్యక్తిగత సమాచారం అడిగితే స్పందిచకూడదని యువతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

జిల్లాపంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ హారీస్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఆన్‌లైన్ గేమ్స్ ఆన్‌లైన్ మోసాలకు దూరంగా ఉండాలని మొబైల్‌లో వచ్చే ఎలాంటి తెలియని ఫైళ్లపై క్లిక్ చేయకూడదని, దీనివల్ల ఖాతాల్లో డబ్బులు పోయే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో మాదకద్రవ్యాలకు దూరంగడా ఉంటానని ట్రాఫిక్ నియమాలను పాటిస్తానని ప్రజా ఆస్తులను కాపాడుతానని అనేక ఇతర కట్టుబాట్లను చేస్తామని ప్రతిజ్ఞ చేయగా, సంతకాల సేకరణ ప్రచారం ద్వారా ప్రముఖులు దానిపై సంతకం చేశారు. మారథాన్ నగరంలోని డీఏఆర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి ఇందిరా సర్కిల్, ఎంజీ రోడ్డు, అనంతపురం బైపాస్ క్రాస్ . సత్యానారాయణ పేట, డీఏఆర్ పరేడ్ గ్రౌండ్ వరకు తిరిగి చేరింది.

ఈసందర్భంగా బళ్లారి జోన్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు బసవరాజ్, అదనపు పోలీస్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్, డీఎస్పీలు నందారెడ్డి, ప్రసాద్ గోఖలే, మాలతేశ్ , తిప్పేస్వామి, సంతోష్ చవాన్, సీపీఐలు అయ్యనగౌడ పాటిల్, మహంతేశ్ రవిచంద్ర ,హనుమంతప్ప, చందనగోపాల్, జిల్లా హోంగార్డు కమాండెంట్ షేక్ సాబ్, పోలీసు అధికారులు, రిటైర్డ్ సైనికులు, ఐఎంఏ సభ్యులు, బళ్లారి రన్నర్స్ అసోసియేషన్ , రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి 1500 మంది పురుషులు , మహిళలు పాల్గొన్నారు.

### మారాథాన్ విజేతలకు అవార్డులు

**పురుషుల విభాగం**

మొదటి బహుమతి రూ.10,000 పురుషోత్తం బళ్లారి
రెండవ బహుమతి రూ.5000 శివానంద బెల్గాం
మూడవ బహుమతి రూ.3000 సునీల్ బెల్గాం

**మహిళల విభాగం**

మొదటి బహుమతి రూ.10,000నగద షాహీన్ ముబ్బళ్ళి
రెండవ బహుమతి రూ.5,000 శిరిష బళ్లారి
మూడవ బహుమతి రూ.3000 విజయలక్ష్మి దార్వడ్


పేర్లు నమోదు చేసుకుంటున్న ఆర్మీ అధికారులు ఈశ్వర్ రెడ్డి, కోటేశ్వరు.

### కాంగ్రెస్ కార్యాలయంలో ..

ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి, దేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశానికి సర్దార్ వల్లబాయ్ పటేల్, ఇందిరా గాంధీ చేసిన సేవలను స్మరించుకోవాలన్నారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు కల్లుకంబ పంపాతి, హనుమంతప్ప, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..


పటేల్, ఇందిర చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ఒనకే ఓబవ్వ జయంతిని ఘనంగా జరుపుకోవాలి

- ఏడీసీ మహమ్మద్ జుబేర్


మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్‌జుబేర్

బళ్లారిసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం నవంబరు 11న జిల్లాకేంద్రంలో వీరవనిత ఒనకే ఓబవ్వ జయంతిని అర్థవంతంగా జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ సూచించారు. నగరంలోని కేశ్వాన్ వీడియో హాల్లో గురువారం అధికారులతో నిర్వహించిన ఓనకే ఓబవ్వ జయంతి ప్రాథమిక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నవంబరు 11న కల్చరల్ కాంప్లెక్స్‌లో కార్యక్రమం జరుగుతుందని, సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వీరవనిత ఓబవ్వ జయంతి కార్యక్రమాన్ని అన్ని తాలూకా కేంద్రాల్లో నిర్వహించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో పారాయణ తేలికపాటి పలహారాలు,తాగునీటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో సాధించిన వ్యక్తులను ఎంపిక చేయాలని, విద్యార్థులకు ఓబవ్వ చరిత్ర వివరించాలన్నారు. ఈసందర్భంగా కన్నడసాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు , సంఘ నాయకులు పాల్గొన్నారు.

## నీరున్నా నిర్లక్ష్యమెందుకు..?

కంప్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుంగభద్రలో నీరున్నా కాలవలకు వదలడానికి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, నిరసనగా ఈనెల 3న కంప్లి బంద్‌కు పిలుపునిస్తున్నట్లు రాష్ట్ర రైతు సంఘం గ్రీన్ ఆర్మీజిల్లా అధ్యక్షుడు బీవీ గౌడ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెంటనే ఐసీసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రెండవ పంటకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆనకట్టలో తగినంత నీరు ఉన్నప్పుడు రెండవ పంటకు నీరు ఇవ్వడానికి ఎందుకు వెనకాడుతారని, నీటి సమస్యపై తుంగభద్ర నీటిపారుదల సలహా కమిటీ అధ్యక్షుడి ప్రకటన సమంజసం కాదన్నారు. ఆనకట్ట క్రస్ట్‌గేట్లకు మరమ్మతులు చేపట్టి సురక్షితంగా తయారు చేయాలన్నారు. వేసవి పంటకు నీరివ్వవచ్చని కన్నయ్య నాయుడు చెబుతున్నారు. 2026 మార్చి చివరి వరకు నీరు విడుదల చేస్తే రెండవ పంటను తీసుకుంటారు. ఏప్రిల్ నుంచి మూడు నెలల్లో క్రస్ట్ గేట్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులు, వ్యాపారులు సంఘ సంస్థలు మద్దతివ్వాలని కోరారు. అధ్యక్షులు వీరేష, నగర యూనిట్ అధ్యక్షులు తిమ్మప్ప నాయక, రైతు నాయకులు చల్లా వెంకటనాయుడు, కొట్టూరు రమేష్, మురారి, గంగన్న, వెంకటరమణ, ఈరన్న, మల్లప్ప, విటి రాజా, విరూపన్న, నాగప్ప పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు చేయాలి

- కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆందోళన



నిరసనలో ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని ఏఐకేకేఎంఎస్ డిమాండ్ చేసింది. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోవింద మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు ఎక్కువగా వరి పంటను పండిస్తారు గత కొన్నిసంవత్సరాలుగా,మిరప రైతులు సరైన ధర లభించకపోవడంతో ఈసారి మొక్కజొన్న అధికంగా సాగు చేశారన్నారు. వర్షాకాలం ప్రారంభ దశలో అధికంగా ఉన్న మొక్కజొన్న ధర ఇటీవల ఘోరంగా పడిపోయిందన్నారు. రైతులు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వమే మద్దతు ధర ప్రకటించి మొక్కజొన్న కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులు ప్రైవైట్ వ్యాపారుల చేతిలో మోసపోవాల్సి వస్తుందన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి గురల్లి రాజా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రైతులు భయాందోళనలో ఉన్నారన్నారు. అంతేకాకుండా నేడు వరి కోత యంత్రాల యజమానులు ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు. వరికోత యంత్రాలకు గంటకు రూ, 2000 కంటే ఎక్కువ వసూలు చేయకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈసందర్భంగా కురుగోడు తాలూకా కార్యదర్శి బసవరాజు, కల్లుకంబపంపాపతి, హొన్నూరప్ప, మాబుసాబ్, మల్లప్ప,హులుగప్ప, పంపనగౌడ, దానప్ప, కళింగప్ప, గంగన్న, కేశవ,మహాలింగప్ప, పలువురు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ


విద్యార్థులతో ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం

కంప్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సండూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం తన జన్మదినం సందర్భంగా గురువారం విద్యార్థకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనాథాశ్రమంలో వారికి కావలసిన సదుపాయాలను కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. నియోజకవర్గంలో తనను నమ్ముకున్న ప్రజలకు సేవలు చేపడతామన్నారు. ఏ సమస్య వచ్చినా చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### నేడు విద్యుత్ కోత

హోసూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి విద్యుత్ పంపిణీ సర్కిల్ హోసూరు డివిజన్‌లోని 110/11 కెవి జూజువాడీ, బేగేపల్లి సబ్-స్టేషన్లలో అవసరమైన నిర్వహణ పనుల కారణంగా నవంబరు 1న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి ఇంజనీర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. జూజువాడీ, సిప్‌కాట్, మూక్కొండపల్లి, బేగేపల్లి, బేడరపల్లి, దర్గా, చిన్న యళసగిరి, సిప్‌కాట్ బాబసింగ్ కాలనీ, అరసనట్టి, సిడ్‌కో ఫేజ్-1 నుంచి సూర్య నగర్, భారతీనగర్, ఎంజీఆర్ నగర్, కామరాజ్ నగర్, ఎళిల్ నగర్, రాజేశ్వరీ లేఅవుట్, నల్లూరు, చిత్తన్నపల్లి, మడివాళం, నల్లూరు అగ్రహారం తదితర గ్రామాలలో విద్యుత్‌కోత ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి

- జడ్పీ సీఈఓకు 'మిడ్‌డే మీల్' ఉద్యోగుల వినతి


జడ్పీ సీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

బళ్లారి సిటీ,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని హాట్ మీల్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేస్తూ జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సీఈఓ మహమ్మద్ హారీస్ మాట్లాడుతూ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఐయూటీయూసీ జిల్లా కమిటీ కార్యదర్శి డాక్టర్ ప్రమోద్, హాట్ మీల్ ఉద్యోగుల సంఘం సలహాదారు నాగరత్న, ఉద్యోగులు ఓబులమ్మ, ఉమా, సుశీలమ్మ, ఆరోగ్య మేరీ పాల్గొన్నారు.

## 'కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహిద్దాం'


మాట్లాడుతున్న తహసీల్దార్ గౌసియా బేగం

సిరుగుప్ప, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : కనకదాసు జయంతి వేడుకలను ఘనంగా ఆచరించాలని తహసీల్దార్ గౌసియా బేగం పిలుపునిచ్చారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలోని శిశు అభివృద్ధి యోజన కార్యాలయ భవనంలో నవంబరు 8వ తేదీన జరుగనున్న కనకదాసు జయంతిపై ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గౌసియాబేగం మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం హైస్కూలు గ్రౌండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బారీ ఎత్తున ఊరేగింపు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో తాలుకా పంచాయతీ ఈఓ పవన్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సంఘ సంస్థల పదాధికారులు, కురుబ సమాజం అధ్యక్షులు దమ్మూరు సోమప్ప, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, కురుబ సమాజం ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# హోసూరు జోన్


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమెల్యే

## సీఎం గ్రామీణ పథక పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

హోసూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): హోసూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని హోసూరు పంచాయతీ యూనియన్‌లో నాబార్డు ప్రాజెక్టుక్రింద హోసూరు- మాలూరు రోడ్డు నుంచి సింగసాధనపల్లి స్కూల్ వరకు సుమారు రూ.4.9 కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి గ్రామీణ రోడ్ల అభివృద్ధి పథకం క్రింద బెళత్తూరు నుంచి తాళ్లపల్లి మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు సుమారు రూ.55 లక్షల 78 వేలతో రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే వై.ప్రకాశ్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, లోకేశ్‌రెడ్డి, యూనియన్ కార్యవర్గ సభ్యులు నాగరాజ్, బాబు, రమేశ్, జిల్లా ట్రేడ్ టీమ్ ఆర్గనైజర్ శివకుమార్, జిల్లా ఆది ద్రావిడ టీమ్ అధికారి మునిరాజ్, బెళత్తూరు రవి, తిమ్మరాయప్ప, రాజేంద్రన్, సౌక్యనాథరాజ్, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

## సీఎస్ఆర్ నిధులతో పాఠశాలకు వసతులు

హోసూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): డెంకణీకోట తాలూకా కెలమంగలం యూనియన్ మేడ ఆగ్రహారం పంచాయతీ కడవరహళ్లి వార్డులో పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో టీల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతులు కల్పించారు. పాఠశాలలో సుమారు 95 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకు ప్రహరీ, విద్యార్థులకు శౌచాలయం నిర్మించారు. టీల్ సంస్థ సీఎస్ఆర్ విభాగం హెడ్ భాస్కర్ ప్రారంభించారు. ఇదే సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాలస్వామి మాట్లాడుతూ టీల్ సంస్థ సామాజికబాధ్యతలో భాగంగా ఎంతో సహకారం అందించిందన్నారు. టీల్ సంస్థ అసోసియేట్ గ్రూప్ మేనేజర్ శివరాజ శేఖర్, సీనియర్ మేనేజర్లు మాణికం, హరిహరన్, మేనేజర్లు తనికైవేల్, రామచంద్రన్, సంఘం అభివృద్ధి కమిటీ సభ్యులు ముత్తురాజ్, గోవిందన్, చిన్నబయ్య, అర్జునన్, ప్రజలు, తల్లితండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నూతన భవన ప్రారంభోత్సవంలో టీల్ కర్మాగార అధికారులు, ఉపాధ్యాయులు

## దుకాణాల తొలగింపుపై ఆగ్రహం


రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టిన దుకాణదారులు

హోసూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): హోసూరు బస్టాండు ప్రాంతంలో కొన్నేళ్లుగా 200కు పైగా పూల దుకాణాలు, తోపుడు బండ్లు ఇతర దుకాణాలు ట్రాఫిక్‌కు అంతరాయం అనే కారణంగా ఉన్నాయన ప్రజల ఫిర్యాదుతో తొలగించారు. కార్పొరేషన్ కమీషనర్ షబీర్ ఆలం ఆదేశాలతో శుక్రవారం కార్పొరేషన్ అధికారులు పోలీసు బందోబస్తు నడుమ దుకాణాలను తొలగించే చర్యలు చేపట్టారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్, హడ్కో ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణి నేతృత్వంలో 50 మందికి పైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. దుకాణాల తొలగింపును నిరసిస్తూ వ్యాపారులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దుకాణాలు కోల్పోయిన తమకు ప్రత్యామ్నాయం కల్పించాలని కోరారు. నిరసనలో పాల్గొన్న 60 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

## అయ్యప్ప దీక్ష ప్రారంభం

బళ్లారి రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్ అంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం మాలధారులు అయ్యప్పదీక్షను స్వీకరించారు. స్వామి ఆశ్రమంలో తాతయ్య గురుస్వామి ఆధ్వర్యంలో 40 మంది దీక్షాధారణ చేపట్టారు. గురుస్వామి తాతయ్య వేదమంత్రోచ్చారణల నడుమ వైభవంగా భక్తులకు కార్యక్రమం నిర్వహించారు. దీక్ష నియమ నిష్టలతో పూర్తి చేయాలని గురుస్వాములు సూచించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రాంబాబు, ఆనంద్, భీమరెడ్డి, రమేష్ రెడ్డి, బోయపాటి విష్ణు, మంజు, యోగి, ఆనంద్, సునిల్, ఇంద్ర, నీలకంఠారెడ్డి, చల్లారమేష్, వీరారెడ్డి, ఇతర అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.


అయ్యప్ప మాలధారులతో గురుస్వాములు

## సేంద్రియ సాగుతోనే అధిక దిగుబడి

- ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి అధికారి సంజుకుమార్


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంప్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నేరా పద్దతిలో సాగుతోనే వరిలో అధిక దిగుబడి సాధించవచ్చని ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి అధికారి సంజుకుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం తాలుకాలోని చిక్కజాయిగనూరు గ్రామంలో రైతు సంపర్క కేంద్రం, శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణ కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యంత్రం ద్వారా ఐదు ఎకరాల్లో వరి నాట్లు వేసిన రైతు అమరేగౌడ పొలంలో రైతులకు రైతు అవగాహన సేంద్రీయ ఎరువులు వాడటం వలన అధిక దిగుబడి వస్తుందన్నారు. ప్రతి యేటా భూములు పరీక్ష చేపట్టి భూములు కావలసిన ఎరువులను వేయాలని రైతులకు తెలిపారు. అనంతరం రైతు అమరేగౌడ మాట్లాడుతూ గత రెండు మూడు సంవత్సరాలుగా నాట్లు బదులుగా యంత్రంతో నేరా పద్దతిలోనే వరి పంటలు వేస్తున్నామని తెలిపారు. ఇలా వేయడం వల్ల అధిక దిగుబడి వస్తుందన్నారు. హంపిదేవనహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు కవితా పంపనగౌడ సంపర్క కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకురాలు నజానిన్ నదాఫ్, అగ్రికల్చర్ ఆఫీసర్ జ్యోతి, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ రేణుక రాజ్, గ్రామస్థులు రైతులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాల దుష్ప్రభావంపై అవగాహన

సిరుగుప్ప, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరమని, వాటికి దూరంగా ఉండాలని దివ్యాంగుల సంఘం తాలూకా అధ్యక్షుడు సాదేషా అన్నారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో దివ్యాంగులు మాదక ద్రవ్యాల పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, సంఘం పదాధికారులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న దివ్యాంగులు